సాక్షి సిద్దిపేట

గురువారం । 9 । నవంబర్ । 2023



సోషల్ వార్..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీల నాయకుల సోషల్‌మీడియాపై దృష్టి సారించారు.

వివరాలు IIలో ▸



అభ్యర్థుల సెంటిమెంట్

అభ్యర్థులు.. ఇష్టదైవాన్ని నమ్ముకుంటున్నారు. ఎన్నికల వేళ.. గెలుపు కోసం తమ వంతు ప్రయత్నంతోపాటు సెంటిమెంట్‌లకు పెద్ద పీట వేస్తున్నారు.

వివరాలు IIలో ▸



స్వీయ రక్షణకు కరాటే

స్వీయరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని జేకేఏఐ జిల్లా చీఫ్ కరాటే మాస్టర్ రాచకొండ అంజనేయులు అన్నారు.

వివరాలు IIIలో ▸



హుస్నాబాద్ పట్టణంలో నామినేషన్ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ

కేసీఆర్ పాలనలోనే సంక్షేమం

బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

హుస్నాబాద్: అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష అని పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా ఐఓసీ కాంప్లెక్స్‌కు తరలి వెళ్లారు. అంతకుముందు ఎల్లమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తల్లిదండ్రుల దీవెనలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతిపక్షాలు అభివృద్ధి నిరోధకులన్నారు. నాడు కేసీఆర్, ప్రజానీకం, యువకులు ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడుతుంటే తెలంగాణ వచ్చేదా చచ్చేదా అని హేళన చేసినవారు ఇప్పుడు వచ్చి మేము అభివృద్ధి చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు.

రూ.9,500 కోట్లతో అభివృద్ధి

తొమ్మిదేళ్లలో నియోజకవర్గాన్ని రూ.9,500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఘననీయంగా అభివృద్ధి చేశానని సతీష్‌కుమార్ తెలిపారు. అన్ని గ్రామాల్లో రహదారులు, అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీరు, చెరువుల మరమ్మతులు ఇలా అనేకం చేశామన్నారు. అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించాలని కోరారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్



హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ..

కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి

హుస్నాబాద్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కాంగ్రెస్ గెలుపు అభివృద్ధికి మలుపు అని పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం నామినేషన్ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకముందు పొన్నం దంపతులు పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి దేవాలయం, ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రచారరథంపై మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌లుతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకొని ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు కాంగ్రెస్ పార్టీ అడ్డుపడిందని ఆరోపిస్తున్న కేసీఆర్ ఇక్కడి ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అసమర్థత వల్లే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. తాను గెలిస్తే హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇదిలా ఉంటే.. హుస్నాబాద్‌లోని సింగిరెడ్డి అమరుల భవన్‌లో బుధవారం పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీఐ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్, చిత్రంలో చాడ వెంకట్ రెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

బీఆర్ఎస్‌తోనే ప్రగతి సాధ్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



దాసరివాడలో ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తున్న కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామంచ మధిర దాసరివాడలో మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు నమ్మవద్దన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం ఎలా మారిందో రాకముందు ఎలా ఉండేనో కళ్లెదుట కనబడుతోందన్నారు. హరీశ్‌రావుకు భారీ మెజార్టీని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ సంతోషి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీపోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సీపీ సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.

భైతి దుర్గయ్యకు బాల సాహిత్య పురస్కారం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ కవి, బాలసాహితీ వేత్త భైతి దుర్గయ్యకు బాల సాహిత్య వికాస పురస్కారం వరించింది. ఈమేరకు బుధవారం బాలసాహితీ వేత్త ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ బాల సాహిత్యంలో విశిష్ట సేవ చేసినందుకు తెలుగు సాహిత్య కళా పీఠం ఈ పురస్కారం ప్రకటించిందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే సమావేశంలో పురస్కారం స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన బాల సాహిత్య రచయితలు, ఉపాధ్యాయులు దుర్గయ్యను అభినందించారు.

హామీలను విస్మరించిన బీఆర్ఎస్



మాట్లాడుతున్న సీపీఐ నేత అశోక్

చేర్యాల(సిద్దిపేట): గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని బీఆర్ఎస్‌ను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు గ్రామాలకు వస్తున్న బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడమే ప్రభుత్వ అసమర్థత పాలనకు నిదర్శనమన్నారు. రైతు రుణమాఫీ, పేదలకు ఇళ్లు, స్థలాలు, కొత్త రేషన్‌కార్డులు, పెన్షన్ల మంజూరు తదితర విషయాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అలాగే ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రకటన చేయకుండా అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు ఈరి భూమయ్య, కుడికాల బాల్ మోహన్, జి.యాదగిరి, వలబోజు నర్సింహాచారి, పోలోజు నర్సయ్య పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు



సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు జరుగుతుందని లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

గజ్వేల్ బరి.. అందరి గురి

హ్యాట్రిక్ గెలుపు కోసం బీఆర్ఎస్

- బహుముఖ వ్యూహంతో ముందుకు
- సత్తా చాటేందుకు బీజేపీ
- కదన కుతూహలంతో కాంగ్రెస్
- రోజురోజుకూ వేడెక్కుతున్న రాజకీయాలు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అందరి దృష్టి గజ్వేల్‌పైనే కేంద్రీకృతమై ఉంది. ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న కేసీఆర్ హ్యాట్రిక్ గెలుపుకోసం కోసం ప్రయత్నిస్తుండగా.. సీఎం ఇలాఖాలో సత్తా చాటేందుకు బీజేపీ, కదన కుతూహలంతో కాంగ్రెస్ రంగంలోకి దిగాయి. నియోజకవర్గంలో ఎన్నికల పోరు రోజురోజుకూ వేడెక్కుతోంది.



కేసీఆర్ (బీఆర్ఎస్)



ఈటల రాజేందర్(బీజేపీ)



తూంకుంట నర్సారెడ్డి(కాంగ్రెస్)

గజ్వేల్: రాష్ట్రవ్యాప్తంగా గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్ హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి నుంచి 'సెంటిమెంట్'గా మూడోసారి పోటీ చేస్తున్నారు. 'రాష్ట్రంలోని పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత నేను తీసుకుంటా.. నన్ను గెలిపించే బాధ్యత మీదే' అంటూ కేసీఆర్ గత నెల 20న మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలో జరిగిన కార్యకర్తల భేటీలో వ్యాఖ్యానించారు. సీఎం వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న పార్టీ యంత్రాంగం భారీ మెజారిటీతో గెలిపించేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకుసాగుతోంది. ఈ నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జులుగా మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిలు వ్యవహరిస్తున్నారు. సమన్వయ కమిటీ సభ్యులుగా కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి కొనసాగుతున్నారు. వీరి అధ్వర్యంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.

ఏకగ్రీవ తీర్మానాలు చేపడుతూ..

ఏకగ్రీవ తీర్మానాలను చేపడుతూనే వివిధ సామాజిక వర్గాల సమావేశాలను జోరుగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వివిధ వర్గాలకు చెందిన చిరుద్యోగుల మద్దతును సైతం కూడగడుతున్నారు. సీఎం గెలిస్తే అందుబాటులో ఉండరని ఇప్పటికే ప్రత్యర్థి పార్టీలు గట్టిగా ప్రచారం చేస్తుండగా, దీనిని ప్రజల నుంచి తొలగించడానికి శ్రమిస్తున్నారు. ఇక నుంచి నెలకో రోజు నియోజకవర్గానికి కేటాయిస్తానని కార్యకర్తల సమావేశంలో కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఈ విషయాన్ని ప్రజలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

అభివృద్ధిని వివరిస్తూ..

కేసీఆర్ పాలనలో గొప్ప మార్పు వచ్చిందని, ప్రత్యేకించి ఇక్కడ వేలాది రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ కళాశాల పాటు మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రింగురోడ్డు, ఎడ్యుకేషన్ హబ్ వంటి అభివృద్ధి ప్రాజెక్ట్‌లే కాకుండా మౌలిక వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలను వివరిస్తున్నారు.

బీజేపీ పోరాటం

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గజ్వేల్‌లో సత్తా చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కేసీఆర్ బాధితులు ఉన్నారని బీజేపీ ప్రచారం చేస్తున్నది. అభివృద్ధి పేరిట ఇక్కడ విధ్వంసం జరిగిందని చెబుతోంది. అభివృద్ధి పేరిట నియోజకవర్గంలో 30వేల కుటుంబాలకు చెందిన భూములను లాక్కున్నారని, సరైన నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో వారంతా అడ్డా కూలీలుగా మారరని చెబుతున్నారు. గెలిపిస్తే అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన నామినేషన్ ర్యాలీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సైతం ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

నేను లోకల్ అంటూ..

కాంగ్రెస్ సైతం కార్యదీక్షతో ఎన్నికల రంగంలోకి దిగింది. ఈ పార్టీ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి నేను లోకల్ అంటూ విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు కలవరని, కార్యకర్తల సమావేశంలో ఈ విషయాన్ని ఒప్పుకున్నారని చెబుతున్నారు. ఇంతకాలం పట్టించుకోని సీఎం ఇప్పుడు పట్టించుకుంటారా...అని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. గజ్వేల్‌లో మూడు ప్రధాన పార్టీల ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలతో ఎన్నికల పోరును హీటెక్కిస్తున్నారు.

కాంగ్రెస్ వైపే ప్రజల మొగ్గు

సిద్దిపేట అభ్యర్థి హరికృష్ణ

సిద్దిపేటజోన్: ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హరికృష్ణ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పార్టీ అభ్యర్థిగా రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం రానుందని, ప్రజలు కాంగ్రెస్‌ను దీవించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అంతకుముందు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మహేందర్ రావు, యాదగిరి, కలిముద్దీన్, అత్తు తదితరులు పాల్గొన్నారు

రక్షకులకు, వ్యతిరేకులకు మధ్య పోటీ.: డీఎస్పీ అభ్యర్థి బాబు

సిద్దిపేటజోన్: ఎన్నికల్లో రాజ్యాంగ రక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు మధ్య పోటీ జరుగుతుందని ధర్మ సమాజం పార్టీ(డీఎస్పీ)అభ్యర్థి బాబు అన్నారు. బుధవారం సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం డీఎస్పీ పాటుపడుతుందని, ఎన్నికల్లో ఆదరించాలని కోరారు.



సిద్దిపేటలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణ

బీఆర్ఎస్‌కే మా మద్దతు

సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాల తీర్మానం

సిద్దిపేటరూరల్: ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన బీఆర్ఎస్‌నే గెలిపించాలని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాల ప్రజలు సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమానికి సుడా చైర్మన్ హాజరై మాట్లాడారు. అన్నివేళలా అందుబాటులో ఉండే మంత్రి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య, సర్పంచ్‌లు ఎల్లవ్వ, భాగ్యలక్ష్మి బాలయ్య, ఎంపీటీసీ చంద్రం, నాయకులు బాలకిషన్‌రావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని అందిస్తున్న మాచాపూర్ గ్రామస్తులు

జిల్లా పోలీస్ అబ్జర్వర్ రాక



భాటియాకు మొక్కను అందజేస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటఅర్బన్: శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియాను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత బుధవారం హరిత హోటల్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకుంటున్న చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, జిల్లా భౌగోళిక పరిస్థితుల గురించి కలెక్టర్, సీపీ వివరించారు.

విద్యాధరిలో పూజలు

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి బుధవారం నామినేషన్‌కు ముందు కుటుంబ సభ్యులతో కలిసి వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మహదాశీర్వచనం పొందారు. హారతి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మోహన్ తదితరులు ఉన్నారు.

నేడు హరీశ్‌రావు నామినేషన్

సిద్దిపేటజోన్: మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 11:30 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందచేయనున్నారు. ఇప్పటికే ఆరుసార్లు అద్భుతమైన విజయాలను సాధించి ఏడోసారి గెలుపు కోసం ప్రజా ఆశీర్వాదం కోరుతున్నారు. 2010 ఉప ఎన్నికలో 95,858 ఓట్ల భారీ మెజారిటీ, 2018 ఎన్నికల్లో 1,18,699 ఓట్ల రికార్డు మెజార్టీ సాధించారు. సీఎం కేసీఆర్ మంత్రి వర్గంలో నీటి పారుదల, మార్కెటింగ్, శాసన సభ వ్యవహారాల శాఖ, ప్రస్తుతం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉన్నా

ఐదేళ్ల అభివృద్ధి అనే పరీక్ష రాశా.. నేను రాసిన పరీక్షకు మార్కులు వేసే నిర్ణయం మీ చేతుల్లో ఉంది. ఎన్నికలప్పుడు వచ్చేవాణ్ణి కాదు.. ఎన్నికలు ఉన్నా లేకున్నా మీ మధ్య ఉండి అభివృద్ధి చేస్తున్నానని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం రాత్రి తన నివాసంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణరెడ్డి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కష్టసుఖాల్లో పాలు పంచుకున్న, నాకు మీరు ఓట్ల రూపంలో మార్కులు వేసి దీవించాలని కోరారు.



బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అరుణకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి

నామినేషన్ కోసం సాయం

హరీశ్‌రావు నామినేషన్ వేసే నేపథ్యంలో మంత్రి దత్తత గ్రామం ఇబ్రహీంపూర్ వాసులు రూ.21 వేలు మంత్రికి అందించి గ్రామస్తులు అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో చేరికలు

గజ్వేల్: మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన యువకులు బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఐదో రోజు 48 నామినేషన్లు

సిద్దిపేటజోన్: జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో బుధవారం ఐదో రోజు జోరుగా నామినేషన్లు దాఖలయ్యాయి. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో 12 నామినేషన్లు, దుబ్బాకలో 05, గజ్వేల్‌లో 25 నామినేషన్లు, హుస్నాబాద్‌లో 6 నామినేషన్లు వచ్చాయి. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్, గజ్వేల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి, సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణ నామినేషన్లు వేశారు.

దుబ్బాకలో ఐదు..

దుబ్బాకటౌన్: దుబ్బాకలో బుధవారం ఐదు నామినేషన్లు దాఖలు అయినట్లు ఆర్‌ఓ గరీమ అగ్రవాల్ తెలిపారు. జక్కుల వెంకట్ (స్వతంత్ర), వేముల వెంకట ప్రసన్న(ధర్మ సమాజ్ పార్టీ), దండ్ల నరేష్ (స్వతంత్ర), పెద్దలింగన్నగారి ప్రసాద్ (స్వతంత్ర), గౌటి మల్లేశ్ (రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ) నామినేషన్లు వేశారని తెలిపారు.

గజ్వేల్‌లో 25..

గజ్వేల్: అసెంబ్లీ స్థానానికి బుధవారం 25 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ తెలిపారు. ఇందులో భాగంగా తూంకుంట నర్సారెడ్డి (కాంగ్రెస్), మాధవరెడ్డి, వరికోలు శ్రీనివాస్, రానవేని లక్ష్మణ్, పల్లె మానిక్‌ప్రభు, కిన్నెర యాదయ్య, ఫారూక్ అహ్మద్ హసన్ మహ్మద్, ముఖేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బొల్లెన పాండు, ఘుక్కెర కృష్ణ, దాసరి భానుచందర్, వడ్డెపల్లి కరుణాకర్, నిఖిల్‌రెడ్డి, జూపల్లి ముత్యాలు, రమేష్‌కుమార్, బెల్లపురం సతీష్‌కుమార్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మామిడి నారాయణరెడ్డి, లింబారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. దుబ్బాక బుగ్గరాజు(ధర్మ సమాజ్ పార్టీ), నేలపాటి నాగరాజు(విద్యార్థుల రాజకీయ పార్టీ), నీరుడి ప్రసాద్(బ్లూ ఇండియా పార్టీ), గుండ ప్రభాకర్‌రెడ్డి(అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ), భూంపల్లి కిశోర్(భారతీయ స్వదేశీ కాంగ్రెస్) నామినేషన్ వేశారు.



గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

సంగారెడ్డికి ఐటీ హబ్, మెట్రో

- బహిరంగ సభలో మంత్రి కేటీఆర్

సంగారెడ్డి: సంగారెడ్డికి మెట్రో రైలు, ఐటీ హబ్ నిర్మాణం జరగాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కంది నుంచి సంగారెడ్డి వరకు కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ మధ్య రోడ్ షో గంజిమైదాన్ వరకు చేరుకొని ముగిసింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ సన్నాసులకు ఒక్క చాన్స్ ఎందుకివ్వాలి? అని ప్రశ్నించారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి తాను గెలుస్తానని, బీఆర్ఎస్‌లో చేరుతానని చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. జగ్గారెడ్డిని పార్టీలో చేర్చుకుంటే చింతా ప్రభాకర్‌కు టికెట్ ఎందుకు ఇస్తామని, గెలిపించమని ఎందుకు కోరుతామని స్పష్టం చేశారు. రోడ్‌షోను చూస్తే ప్రభాకర్ గెలుపు తేలికవుతోందని తెలుస్తోందన్నారు.



రోడ్‌షోలో కేటీఆర్

క్లుప్తంగా

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్ : నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): హామీలను విస్మరించి ప్రజల విశ్వాసం కోల్పోయిన కేసీఆర్‌ను ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం వర్గల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలిచిన వెంటనే గజ్వేల్ పట్టణ నిరుపేదలకు 5 వేల ఇళ్లు నిర్మించి ఇస్తానన్న హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, స్థానిక సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, పార్టీ మండలఅధ్యక్షుడు సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా..

దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ నిర్వాసితులకు అండగా ఉండి ఆదుకుంటానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేట, చందాపూర్, రాంపురం, లింగంపేట గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్న సాగర్ నిర్వాసితులకు పరిహారం అందించకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. తుక్కాపూర్ నిర్వాసితులకు రూ.16 లక్షల పరిహారం అందించే చర్యలు తీసుకున్నామన్నారు. ఎల్లారెడ్డిపేట, ఘనపురం, బండారుపల్లి గ్రామాల నిర్వాసితులకు పరిహారం అందేలా కృషిచేశానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రం, సర్పంచ్ నర్సింలు యాదవ్, ఎంపీటీసీ నర్సింలు, నాయకులు స్వామిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే అభివృద్ధి

దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్, చీకోడ్, ఆరెపల్లి, పోతారం, అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లో దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. దుబ్బాకలో బస్సుడిపో, కోర్టు, మున్సిపాలిటీ, ఐటీఐ, డిగ్రీ కళాశాల, ప్రతీ మారుమూల గ్రామంలో సీసీ రోడ్లు వేసిన ఘనత ముత్యంరెడ్డికే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని వారి మాయ మాటలు నమ్మకూడదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గెలుపు కోసం హోమం



హోమం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి దంపతులు

చేర్యాల(సిద్దిపేట): కొమురవెల్లి మండల పరిధిలోని గురువన్నపేటకు చెందిన వివిధ పార్టీల నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు బుడిగె ఐలేని, అశోక్, జిల్లె సంపత్, పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం



జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కె.మాణిక్ రావు పోటీ పడుతుండగా, కాంగ్రెస్ తరఫున ఎ.చంద్రశేఖర్ పోటీ పడుతున్నారు. ఇరువురికి మొదటి విడతలోనే ఆయా పార్టీల అధిష్టాన వర్గాలు టిక్కెట్లు ఖరారు చేయడంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. బీజేపీ టికెట్ కాస్త ఆలస్యంగానైనా రాంచందర్ రాజనర్సింహాకి రావడంతో కార్యకర్తలను ప్రచారానికి సిద్ధం చేస్తున్నారు. –జహీరాబాద్

దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- ప్రచారానికి సిద్ధమైన బీజేపీ
- సైలెంట్‌గా ముందుకెళ్తున్న బీఎస్పీ
- జహీరాబాద్‌లో హోరాహోరీ



నియోజకవర్గం పరిధిలోని జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో మొదటి విడత ఎన్నికల ప్రచారాన్ని ప్రధాన పార్టీలు పూర్తి చేశాయి. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్, భార్య ప్రమీల తలా ఓ దిక్కు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టి చివరి దశకు తీసుకొచ్చారు. ఇరు పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేసి కార్యకర్తల్లో జోష్ నింపారు. ఇప్పటికే చంద్రశేఖర్ నామినేషన్ సైతం దాఖలు చేశారు.

మేనిఫెస్టోతో ముందుకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీల ఎన్నికల మేనిఫెస్టోనే ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ప్రచారంలో కరపత్రాలను పంచుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి మాణిక్‌రావు, కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను చంద్రశేఖర్ వివరిస్తూ ఓట్లడుగుతున్నారు.

ఇప్పుడిప్పుడే బీజేపీ సన్నద్ధం

అభ్యర్థిని ప్రకటించడంలో బీజేపీ తీవ్ర జాప్యం చేసింది. రెండు రోజుల క్రితం రాంచందర్ రాజనర్సింహా అభ్యర్థిత్వాన్ని అధిష్టాన వర్గం ఖరారు చేయడంతో ఆయన కార్యకర్తలను ప్రచారానికి సిద్ధం చేస్తున్నారు. టికెట్‌ను గట్టిగా ఆశించి భంపడ్డ ఢిల్లీ వసంత్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అలాగే, బీఎస్పీ అభ్యర్థి జంగం గోపి మాత్రం ఆర్భాటాలకు వెళ్లకుండా చాపకింద నీరులా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీ గుర్తు ఏనుగును వాహనంపై పెట్టి ప్రచారం చేస్తున్నారు.

ముఖ్యనేతలను తీసుకొచ్చే పనిలో..

నియోజకవర్గంలో ముఖ్య నేతలతో ప్రచారం చేసేందుకు ప్రధాన పార్టీలు సన్నద్ధం అయ్యాయి. సీఎం కేసీఆర్ ఈనెల 23వ తేదీన జహీరాబాద్ సభలో పాల్గొననున్నారు. కాంగ్రెస్ తరఫున ప్రియాంక లేదా రాహుల్ గాంధీతో ప్రచారం చేయించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. బీజేపీ తరఫున ఈనెల 10వ తేదీన కేంద్రమంత్రి నారాయణ రాణేతో కలిసి అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహా నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

జంగ్ తెలంగాణ

సోషల్ వార్..

- సోషల్ మీడియాలో నాయకుల విస్తృతప్రచారం
- నాయకులు, దోస్తుల పేరిట ప్రత్యేక గ్రూపులు
- క్షణాల్లో కళ్లముందర సమాచారం



దుబ్బాకటౌన్ : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీల నాయకులు సోషల్‌మీడియాపై దృష్టి సారించారు. ఓ వైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రజల్లో ఉంటూనే ప్రత్యర్థుల ఆటకట్టించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. తాము చేసిన పనులు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు తమను విమర్శించే వారి నుంచి స్వీయ రక్షణ పొందేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ తమ పరిధిలో ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యకర్తలను నియమించుకుంటూ వార్‌కు సిద్ధం చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారం ఎక్కువగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో కనిపిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న నియోజకవర్గ అభ్యర్థులు సోషల్ మీడియాను బాగా వినియోగించుకుంటున్నారు. తమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడూ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీ కార్యక్రమం వారు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల ద్వారా క్షణాల్లో ఫొటోలు, వీడియోలతో పంపిస్తున్నారు. తమకు ఓట్లు వేసేలా ప్రత్యేక గ్రూపులతో నేతలు ప్రచారం చేస్తుండడం విశేషం. ఈ ఎన్నికల్లో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరిట కేపీఆర్ సైన్యం, దుబ్బాక బీఆర్‌ఎస్ సైన్యం, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేరిట రఘున్న యువసైన్యం, బీజేపీ మీడియా గ్రూపు, కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేరిట శ్రీనన్న సైన్యం, దుబ్బాక కాంగ్రెస్ సేన పేరిట గ్రూపులు క్రియేట్ చేసి జోరుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో హరీశన్న సైన్యంతోపాటు రకరకాల గ్రూపులు వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు.

భగవంతుడి ఆశీస్సులతో..

- కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత
- కోనాయిపల్లి వెంకటేశ్వర ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజ
- నేడు దుబ్బాకలో నామినేషన్, హాజరుకానున్న హరీశ్‌రావు



కోనాయిపల్లి వెంకటేశ్వర ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు చేస్తున్న మంజులతారెడ్డి

దుబ్బాకటౌన్ : దేవుడి దయ.. ప్రజల ఆశీస్సులతోనే నా భర్త ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారని కొత్త మంజులతారెడ్డి అన్నారు. బుధవారం మంజులతారెడ్డి భర్త ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను కోనాయిపల్లి వెంకటేశ్వరాలయంలో స్వామివారి పదాల వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుబ్బాకలో భారీ మెజార్టీతో ప్రభాకర్‌రెడ్డి గెలుపొందడం ఖాయమని అన్నారు. భగవంతుడి కరుణ, మీ ఆశీస్సులు ఉన్నన్ని రోజులు ప్రజాసేవ చేస్తామన్నారు.

ఆస్పత్రి నుంచి నేరుగా..

కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సూరంపల్లిలో దుండగుడి చేతిలో కత్తిపోటుకు గురై తీవ్ర గాయాలతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నామినేషన్ వేసేందుకు గురువారం ఉదయం 11.15కు ఆస్పత్రి నుంచి ప్రత్యేక వాహనంలో రానున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో దుబ్బాకలోని ఐఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ చాంబర్‌లో నామినేషన్ వేస్తారని మంజులతా రెడ్డి తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు. నామినేషన్ అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి పట్టణంలో ప్రధాన వీధుల గుండా జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

అభ్యర్థుల సెంటిమెంట్

- ఇష్టదైవాన్ని నమ్ముకుంటున్న అభ్యర్థులు
- కోనాయిపల్లిలో నామినేషన్ పత్రాలపై కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు
- మేనమామ సంతకంతో హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్
- తల్లి దీవెనలతో పొన్నం ప్రభాకర్
- గెలుపు కోసం ఎవరి సెంటిమెంట్ వారిది

సాక్షి, సిద్దిపేట : ఎన్నికల వేళ.. గెలుపు కోసం తమ వంతు ప్రయత్నంతోపాటు ఇష్టదైవాన్ని నమ్ముకోవడం, సెంటిమెంట్‌లకు పెద్ద పీట వేస్తున్నారు. శాసన సభ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్‌ల స్వీకరణ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే పలువురు ఆయా నియోజవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేయగా, మరి కొందరు మంచి ముహూర్తాలతోపాటు సెంటిమెంట్ దేవాలయాల్లో పూజలు, సెంటిమెంట్ వ్యక్తులతో నామినేషన్ పత్రాలపై ప్రతిపాదన సంతకాలు చేపిస్తున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, తల్లి తండ్రులు, గురువుల ఆశీర్వాదం తీసుకొని నామినేషన్‌లను దాఖలు చేస్తున్నారు. 9వ తేదీ గురువారం ఏకాదశి, 10వ తేదీ శుక్రవారం ద్వాదశి ఉండడంతో ఈ చివరి రెండు రోజులు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నేడు, రేపు నామినేషన్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

నేడు ప్రభాకర్ రెడ్డి నామినేషన్



నేడు దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త ప్రభాకర్ రెడ్డి నామినేషన్ వేయనున్నారు. తొలుత కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తర్వాత పోతారం హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించి మంత్రి హరీశ్ రావుతో కలిసి నామినేషన్ వేయనున్నారు.

తల్లి దీవెనలు...



హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పొన్నం ప్రభాకర్ గౌడ్ తల్లి దీవెనలు తీసుకొని నామినేషన్ వేశారు. ప్రతీ సారి తల్లి మల్లమ్మ దీవెనలు తీసుకుంటున్నారు. తర్వాత రేణుక ఎల్లమ్మను దర్శించుకున్నారు. పొట్లపల్లి స్వయం భూ రాజేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత ర్యాలీగా వచ్చి నామినేషన్‌ను దాఖలు చేశారు.

కోనాయిపల్లిలో సీఎం కేసీఆర్..



బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్ రావులు ఇద్దరికీ నంగనూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలోనే నామినేషన్ పత్రాలపై సంతకాలు పెట్టడం సెంటిమెంట్. గజ్వేల్, కామారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న హరీశ్‌రావు ఈ నెల 4వ తేదీన కోనాయిపల్లిలో నామినేషన్‌లపై సంతకాలు చేశారు. కేసీఆర్ 38 ఏళ్లుగా ఇదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తుండగా , 2004 నుంచి హరీశ్ రావు అదే సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. నేడు గజ్వేల్‌లో కేసీఆర్, సిద్దిపేటలో హరీశ్ రావు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ప్రతిపాదనల్లో మేనమామ సంతకం



తండ్రి ఆశీస్సులు తీసుకుంటున్న సతీష్ కుమార్

హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వొడితెల సతీష్ కుమార్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. నామినేషన్ పత్రాలపై తన మేనమామ వేముగంటి భాస్కర్ రావుతో తొలి ప్రతిపాదన సంతకం చేయించడం సెంటిమెంట్, ఈసారి సైతం అదే పాటించారు. బుధవారం స్వగ్రామం సింగపురంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత హుస్నాబాద్‌లో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం నాన్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆశీర్వాదం తీసుకున్నారు.

స్వగ్రామంలో పూజలు..



దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు తొలుత స్వగ్రామం బొప్పాపూర్‌లో బొడ్రాయి వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుబ్బాకలోని మారెమ్మ దేవాలయంలో నామినేషన్ పత్రాలు పెట్టి పూజలు నిర్వహించి, నామినేషన్ దాఖలు చేశారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జాగృతి జాతీయ అధ్యక్షులు అనంతుల ప్రశాంత్ కోరారు. మండల కేంద్రమైన కొండపాకలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చిట్టి మాధురీరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి చేయడం చేతకానీ కాంగ్రెస్, బీజేపీలు గ్రామాల్లో తిరుగుతూ మాయమాటలు చెబుతూ ఓట్లు దండుకునేలా చూస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మి, నాయకులు నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, సింగాటం రాములు, గోనె శ్రీనివాస్, దొమ్మాట మహిపాల్‌రెడ్డి, బొద్దుల కనుకయ్య, రాధాకిషన్ రెడ్డి, అనంతుల పద్మ, రామక్రిష్ణారెడ్డి, అనంతుల నరేందర్, ఎగుర్ల వెంకటేశం, తోటకూరి మల్లేశం, జిగ్రి రాజు, బోదాస్ స్వామి, సున్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడుకులా సీఎం కేసీఆర్

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పార్టీలకు అతీతంగా వివిధ రకాల పెన్షన్లు అందిస్తూ పెద్దకొడుకులా నిలిచిన సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ కోరారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షులు స్వామి, తూం శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మహిళలందరూ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో డ్యాన్సులు చేస్తూ బతుకమ్మ పండుగ సంబురం తలపింపజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, నాయకులు మహేశ్, కిరణ్ కుమార్‌చారి, బాల్ నర్సు, సాయిలు, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోల శ్రీనివాస్, లగిశెట్టి కనకయ్య, మల్లం ఐలయ్య, కందూరి ఐలయ్య, మిట్టపల్లి రుషీ, కొంతం రాజు, తూం మహేందర్,కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

18న రెండో విడత ర్యాండమైజేషన్

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఈవీఎంల రెండోవిడత ర్యాండమైజేషన్‌ను ఈనెల 18న పర్యవేక్షించి, ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోలింగ్ విధుల నిర్వహణపై కలెక్టరేట్‌లో రిటర్నింగ్, అసిస్టెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గానికి అవసరమైన వాహనాలను రవాణా శాఖ నుంచి సమకూర్చడం జరుగుతుందని, అదనంగా వాహనాలను సమకూర్చుతామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి రిసెప్షన్ సెంటర్ వరకు వాహనాలకు జీపీఎస్ అమర్చుతామన్నారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక రంగులతో కూడిన బ్యానర్లను వాహనాలకు ఏర్పాటు చేయాలని, 21, 22, 23 తేదీల్లో ఎన్నికల పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ రోజు ఈసీఐ నిబంధనల మేరకు పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూట్లవారీగా ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనేలా పోలీస్‌శాఖ సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు.

ఈవీఎం మిషన్లపై శిక్షణ...

ఈవీఎం మిషన్ల నిర్వహణపై జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నాలుగు నియోజకవర్గాల సెక్టార్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులు ముఖ్యమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ ఎలక్షన్ అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, దుబ్బాక, సిద్దిపేట హుస్నాబాద్ ఆర్వోలు గరిమా అగర్వాల్, రమేశ్ బాబు, బెన్ సాలెం, డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా రవాణా శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, ఎంపీఐలు, తదితరులు పాల్గొన్నారు.

'తల్లి' దీవెనలు ఎవరికో..



కరచాలనం చేసుకుంటున్న సతీష్‌కుమార్, పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం నామినేషన్ల సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఇద్దరూ దేవాలయంలో ఆప్యాయంగా పలుకరించుకొని కరచాలనం చేసుకున్నారు. ఎల్లమ్మ దేవత దీవెనలు ఎవరికి ఉంటాయో ఎన్నికల ఫలితాలు వెల్లడైతే గాని తెలియదు.

చేసిన అభివృద్ధి అంతా కాంగ్రెస్‌దే

టేక్మాల్(మెదక్): రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే కాంగ్రెస్ చేసినా అభివృద్ధియే తప్పా బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమీలేదని కాంగ్రెస్ పార్టీ అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎల్లంపల్లి, గొల్లగూడెం, పల్వంచ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఎల్లంపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ బీసీసెల్ మండలాధ్యక్షుడు కిష్టయ్య, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.



ప్రచార 'పండు'గలో కాసేపు..

టేక్మాల్(మెదక్): ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ బుధవారం టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి 161 హైవే వద్ద కాసేపు ఆగి కార్యకర్తలతో టీ తాగారు. అనంతరం హైవే వెంబడి సీతాఫలాలు అమ్ముతున్న వారి వద్ద పండ్లు కొనుగోలు చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట చింత రవి, అవినాష్, చంద్రశేఖర్‌రెడ్డి, బహిరన్‌దిబ్బ దుర్గయ్య పాల్గొన్నారు.



అవ్వా.. కారుకు ఓటేయ్

చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారంలో భాగంగా బుధవారం చేర్యాల పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఓ ఇంటి ముందు చీపురు తయారు చేస్తున్న అవ్వను ఓటు అభ్యర్థించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.